క్లుప్తంగా

డ్రోన్ కెమెరాలతో నిఘా

రేణిగుంట: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శుక్రవారం రేణిగుంట మండలంలోని కరకంబాడి, వెంకటాపురం, రేణిగుంట పరిసర ప్రాంతాల్లో అర్బన్ ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరాల సహాయంతో ఖాళీ స్థలాలను, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, గంజాయి వినియోగంపై నిఘా ఉంచారు. బహిరంగ ప్రదేశాల్లో మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడమే ముఖ్య ఉద్దేశంగా డ్రోన్లు వినియోగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

తొట్టంబేడు: మండలంలోని చిట్టత్తూరు అరుంధతివాడలోని మాతమ్మ ఆలయం వద్ద ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ల రాజా మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాదిగల అభివృద్ధి కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం ఎనలేనిదన్నారు. అనంతరం గ్రామంలో నాయకులు, కార్యకర్తలకు అన్నదానం చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

రేపు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కాంపాళెం, కంచనపుత్తూరు, నెలవాయి, వేణుగోపాలపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనరు కొణతనేని మణినాయుడు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

శ్రీసిటీలో రక్తదాన శిబిరం



శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి ఎన్టీఆర్ ట్రస్టు, శ్రీసిటీ యాజమాన్యం సంయుక్తంగా బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వారి సేవలను శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

రుణమేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వ్యాపారస్తులకు రుణమేళా నిర్వహించారు. అందులో భాగంగా కేంద్ర పథకాలు అయిన ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ పథకాలను, ఎస్‌బీఐ కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈ పథకంలో వ్యాపారులకు జీఎస్టీ, ఐటీ రిటర్న్‌ను అనుసరించి గంట వ్యవధిలో రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజరు ఫణికుమార్, ఏడీబీశాఖ చీఫ్ మేనేజరు మోహన్‌రాజు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు



పాండవుల వేషధారణలో యువకులు

నారాయణవనం: మహాభారత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు గ్రామ వీధుల్లో విహరించారు. స్థానిక గాండ్ల వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్తర గోగ్రహణం యుద్ధాన్ని తలపించేలా నిర్వహించిన ఉత్సవంలో యువకులు కృష్ణుడు, పాండవులు, కౌరవుల వేషాలు వేసుకుని ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం అరుణానదిలో పేల్చిన బాణసంచా ఆకట్టుకుంది. ఉదయం అర్జున తపస్సు ఉత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సు మాను ఎక్కి పండ్లు, పూలను భక్తులు, మహిళలకు అందజేశాడు.

గంగ జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రేణిగుంట: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రేణిగుంట గంగమ్మ జాతర భద్రత ఏర్పాట్లపై మండల అధికారులు సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పట్టణ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామన్నారు. భక్తుల రద్దీ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్, విద్యుత్ వంటి అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఆర్ఐ జయకృష్ణ, సర్పంచ్ నగేశం, మండల కో ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిరిసిటీ

- ఆదర్శ పారిశ్రామికవాడగా శ్రీసిటీ
- 31 దేశాలకు చెందిన 240 పరిశ్రమలు ఏర్పాటు
- రూ.45 వేల కోట్ల పెట్టుబడులు.. 65 వేల మందికి పైగా ఉద్యోగాల కల్పన





శ్రీసిటీ ఏరియల్ వ్యూ, (ఇన్‌సెట్) 2008లో పరిశ్రమల ఏర్పాటుకు పైలాన్ ఆవిష్కరిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

శ్రీసిటీ(వరదయ్యపాళెం): ఓ మహానేత నాటిన చిన్న మొక్క నేడు మహావృక్షంగా మారింది. వెనుకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గానికి ఆశాకిరణంగా నిలిచింది. శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశంలోనే ఆదర్శ సెజ్‌గా రూపుదిద్దుకుంది. 2008 ఆగస్టు 8వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా శ్రీసిటీ పురుడు పోసుకుంది. నిన్నటితో పదిహేడేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఆ మహాప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించింది. ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించింది. 31 దేశాలకు చెందిన 240 పరిశ్రమలతో 65 వేలకు పైగా ఉద్యోగులతో నేడు ఆదర్శ సెజ్‌గా విరాజిల్లుతోంది. కాఫీ కప్పుల నుంచి మెట్రో రైళ్ల వరకు.. ఆహార ఉత్పత్తులు.. ఎలక్ట్రానిక్స్.. ఏసీల తయారీ హబ్.. ఇంజినీరింగ్, ఆటోమొబైల్స్ నిలయంగా మారింది. అంతేకాక భారతదేశ పారిశ్రామిక నమూనాను మార్చి ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది.

ప్రపంచ తయారీ కేంద్రం

ఆంధ్ర–తమిళనాడు సరిహద్దులో తిరుపతి జిల్లాలో 2008, ఆగస్టు 8న ప్రారంభించబడిన శ్రీసిటీ 8 వేల ఎకరాల విస్తీర్ణంలో భారతదేశంలో అతిపెద్ద ఏకీకృత వ్యాపార నగరం (ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీ). ఈ పారిశ్రామిక కేంద్రం దాదాపు రూ. 45 వేల కోట్ల పెట్టుబడులతో 31 దేశాలకు చెందిన 240కి పైగా ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలకు నిలయమైంది. 35 జపాన్ కంపెనీలకు ఆతిథ్యం ఇస్తూ, దేశంలో రెండో అతిపెద్ద జపనీస్ పెట్టుబడుల గమ్యస్థానంగా నిలిచింది.

మైలురాళ్లు

తన ప్రయాణంలో శ్రీసిటీ పలు అద్భుతమైన మైలురాళ్లను అధిగమించింది. రూ.65 వేల కోట్లకు పైగా ఎగుమతులు చేపట్టింది. 65 వేల మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. వీరిలో 52 శాతం మహిళలు ఉంటూ 'స్త్రీ సిటీ' అనే బిరుదు దక్కించుకుంది.

'ఆత్మనిర్భర భారత్'కు కార్యరూపం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రగతిశీల విధానాల ప్రోత్సాహంతో «మేక్ ఇన్ ఇండియా», «ఆత్మనిర్భర్ భారత్» దార్శనికతకు దర్పణంలా నిలిచింది. టూత్ బ్రష్‌ల నుండి ఆటోమొబైల్స్ వరకు, స్టీల్ ఫాస్టెనర్‌ల నుండి మెట్రో కోచ్‌ల వరకు, ఫుడ్ ప్రాసెసింగ్ నుండి ఎయిర్ కండిషనర్‌ల వరకు విభిన్న తయారీ రంగాలకు చెందిన కోల్గేట్, మోండెలెజ్, డైకిన్, ఆల్‌స్టామ్, కెల్లాగ్స్, ఇసుజు, కింబర్లీ–క్లార్క్ తదితర గ్లోబల్ సంస్థలు దేశీయ మార్కెట్‌లకు అవసరమైన ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తారు. 60కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత దేశ విదేశీ మారక నిల్వలను బలోపేతం చేస్తున్నారు. ఎయిర్ కండిషనింగ్ తయారీలో అత్యంత వ్యూహాత్మక నగరంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. అన్ని ప్రధాన ఏసీ యూనిట్ల తయారీదారులు ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేశారు.

వ్యాపారమే కాదు.. సామాజిక సేవ

పారిశ్రామిక కార్యకలాపాలతోపాటు పరిసర ప్రాంతాల సామాజిక ఆర్థికాభివృద్ధిలో శ్రీసిటీ చొరవ చూపుతోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ పరిశ్రమల భాగస్వామ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు, సామాజిక మౌలిక సదుపాయాలు, జీవనోపాధి తదితర కీలక సామాజిక అవసరాలపై సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు గత పదిహేడేళ్లుగా కొనసాగిస్తున్నారు.

ప్రపంచ పటంలో స్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల నుండి «మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్» వరకు శ్రీసిటీ 17 సంవత్సరాల ప్రయాణం దాని దార్శనికత, స్థితిస్థాపకత, సమ్మిళిత వృద్ధిని చాటి చెబుతోంది. పెట్టుబడుల కేంద్రంగానే కాకుండా, ప్రణాళికాబద్ధమైన సామాజిక మౌలిక సదుపాయాల ద్వారా భారతదేశ పారిశ్రామిక భవిష్యత్తును రూపొందించే అత్యుత్తమ ప్రదేశంగా ప్రపంచ పటంలో శ్రీసిటీ స్థానం దక్కించుకుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

శ్రీసిటీ నమూనాకు జాతీయ గుర్తింపు



శ్రీసిటీ ప్రాజెక్ట్ ఆఫీస్

శ్రీసిటీ ప్రగతి ప్రయాణం జాతీయ దృష్టిని ఆకర్షించడం విశేషం. శ్రీసిటీ ద్వారా ఆంధ్రప్రదేశ్ తయారీ రంగం ఆర్థికంగా బలపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కితాబిచ్చారు. శ్రీసిటీ భవిష్యత్ వృద్ధి భారతదేశ జీడీపీకి కీలకమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. నీతి ఆయోగ్ సీఈఓ డాక్టర్ బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం శ్రీసిటీ పర్యావరణ నిర్వహణ, ప్రపంచ సమ్మిళితత్వాన్ని కొనియాడారు.

సుస్థిర ప్రగతి



నేను పుట్టిన ప్రాంతానికి ఏదైనా చేయాలన్న బలమైన కోరికతో పురుడు పోసుకున్న శ్రీసిటీ, నేడు ప్రపంచ తయారీ గమ్యస్థానంగా మారడం ఎంతో సంతోషంగా ఉంది. పరిశ్రమలు, ఉపాధితోపాటు సామాజిక వసతుల కల్పనపై ప్రస్తుతం దృష్టి సారిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పారిశ్రామిక విధానాలు, సహకారం భవిష్యత్తులో శ్రీసిటీని సుస్థిర ప్రగతి దిశగా మరింత వేగంగా ముందుకు నడిపిస్తుంది.

–డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటీ

రాచకండ్రిగలో వేధిస్తున్న లోఓల్టేజ్



నిరసన తెలుపుతున్న రాచకండ్రిగ గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం పంచాయతీ రాచకండ్రిగ గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోఓల్టేజ్ సమస్యతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో రాత్రివేళ పూర్తిగా విద్యుత్ లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో పరిమితికి మించి విద్యుత్ సర్వీసులు ఉండడంతో లోఓల్టేజ్ సమస్య వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో అనేకమార్లు గ్రామస్తులు నిరసన తెలిపినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారుల నుండి స్పందన లేదు. ఇటీవల ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అది రెండో రోజే కాలిపోవడం గమనార్హం. ఇలా తరచూ గ్రామస్తులు విద్యుత్ లేని రాత్రిళ్లు గడుపుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తుల లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వరదయ్యపాళెం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన కేవీబీపురం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నింద్ర మండలం కావనూరుకు చెందిన గిరి(40) లా చదువుతున్నాడు. శ్రీకాళహస్తిలో సొంత పనులు ముగించుకుని బుధవారం రాత్రి పిచ్చాటూరు మార్గంలో కావనూరుకు బయల్దేరాడు. శ్రీకాళహస్తి మండలం కందాడకు చెందిన అయ్యప్ప(23)తోపాటు, అతని స్నేహితుడు(23) కేవీబీపురం నుంచి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మఠం గ్రామ శివార్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుండి తిరుపతిలోని ఒక ప్రైవేట్ హస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వారిలో గిరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపైన గుంతలు పూడ్చేందుకు వేసిన గ్రావెల్ మట్టి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు రోడ్డుకు శుక్రవారం రాళ్ల క్వారీ, క్రషర్ యజమానులు మరమ్మతులు చేయించారు. శుక్రవారం ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ, గ్రామాలకు కేటీరోడ్డు నుండి వెళ్లే రోడ్డు రాళ్ల మెటల్ టిప్పర్లు తిరగడంతోనే గుంతలమయమై అధ్వాన్నంగా తయారైందని గ్రామస్తులు రోడ్డుపై నిరసన తెలిపారు. రాళ్ల మెటల్ తీసుకెళ్లుతున్న టిప్పర్ లారీలను నిలిపి, రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ రాళ్లను నాటారు. దీంతో స్పందించిన రాళ్ల క్వారీ, క్రషర్ యజమానులు రోడ్డుపై ఉన్న గుంతలకు గ్రావెల్ మట్టిని తోలి పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించారు. దీంతో రోడ్డు కొంత మేర బాగుపడింది. తాత్కాలిక మరమ్మతులు చేయడంతో మళ్లీ రోడ్డు దెబ్బతింటుందని, శాశ్వత మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్ఐఆర్‌తో పౌరసత్వానికి ముప్పు

శ్రీకాళహస్తి/రేణిగుంట: భారతీయ జనతా పార్టీ ఆధీనంలోని కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఎస్ఐఆర్ విధానం వల్ల భారతీయుల పౌరసత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా శుక్రవారం శ్రీకాళహస్తి పెండ్లి మండపం వద్ద, అలాగే రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, రేణిగుంటలో ఆ పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా సమగ్రంగా సవరించాలని చూస్తోందన్నారు. ఓటర్ల జాబితాలను సవరించే పేరుతో ఈసీ ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారాన్ని స్వాధీనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అధీకృత ఎన్నికల సంఘం దేశ ప్రజాస్వామిక వ్యవస్థపై చేస్తున్న దాడిని ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం, ఆవాజ్ సంఘం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నేతలు పాల్గొన్నారు.



గుడిమల్లం పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన చారిత్రాత్మక శైవక్షేత్రం శ్రీఆనందవల్లీ సమేత పరశురామేశ్వరాలయం నూతన పాలక మండలి ఏర్పాటుకు విజయవాడ ధార్మిక పరిషత్ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన పాలక మండలి కోసం ప్రయత్నిస్తున్న ఆశావాహులు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తులను తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారికి నేరుగా సమర్పించాలని సూచించారు.

పున్నమి వెన్నెల్లో ముక్కంటీశుడు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపు అనంతరం ఊంజల్‌సేవ మండపానికి తీసుకువచ్చారు. వేదమంత్రోచ్చరణల నడుమ ఊంజల్ సేవ జరిగింది. వెన్నెల కాంతులో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఊంజల్‌సేవలో శ్రీకాళహస్తీశ్వరుడు

గస్తీ పెంచాలని వినతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మహిళా కళాశాల విద్యార్థుల భద్రత కోసం ఆ దారిలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తికి శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు రాహుల్ తదితరులు పాల్గొన్నారు

చేనేత కార్మికులకు ప్రశంసా పత్రాలు

వరదయ్యపాళెం: మండలంలోని చేనేత కార్మికులకు ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మరదవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు బుర్రా కృష్ణమూర్తి, ప్రోగ్రాం లోకల్ ఇన్‌చార్జ్ జయప్రకాష్, మరదవాడ మాజీ సర్పంచ్ బీరక శ్యామల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా కార్మికులందరికీ ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

రక్షా బంధన్



తహసీల్దార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

సత్యవేడు: ఈశ్వరీయ బ్రంహ్మకుమారీలు భారతి, అరుణ ఆధ్యాత్మిక రక్షా బంధన్‌ను ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు రాఖీలు కట్టారు. శుక్రవారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రాజశేఖర్, డీటీలు టి.వెంకటేశన్, ఎ.త్యాగరాజు, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, బి.వసంత్, డి.కార్తీక్‌లకు రాఖీలు కట్టారు.

గంగమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలో గ్రామస్తులు నిర్మించిన శ్రీగంగమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం తీర్థ సంగ్రహణ, మృత్తికా సంగ్రహణ, కలశ స్థాపన, మధ్యాహ్నం ఆచార్య తదియారాధన, సాయంత్రం గణపతిపూజ, స్వస్తి పుణ్యహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుబలి, వాస్తు హోమం, ఆలయశుద్ధి కార్యక్రమాలు జరిగాయి. శనివారం గోపూజ, గణపతి, యంత్ర ప్రతిష్ట, అర్చన, ఆచార్య తదియారాధన, యాగశాల పూజలు, మూలమంత్రహోమం, ప్రతిష్ట, అర్చన, నివేదన, హారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయి. ఆదివారం యాగశాల పూజలు, నాడీ సంధానం, ప్రాణప్రతిష్ట, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, మహా కుంభాభిషేకం, అలంకారం, స్వర్ణదర్పణం, గోదర్శనం, నివేదన, హారతి, కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం, ఆదివారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు.

వేడుకగా అర్జున తపస్సు



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో తర్జున తపస్సు ఉత్సవం



వరపడుతున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి 155వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సుమాను ఆట వేడుకగా జరిగింది. ఆలయం ముందు తాటిచెట్టుతో తపస్సుమానును ఏర్పాటు చేసి అర్జునుడి వేషధారి మంత్రోచ్చరణల మధ్య ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తపస్సుమానును అధిరోహించి, అక్కడ నుంచి నిమ్మపండ్లు, విభూతిని కిందకు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని అర్జున తపస్సు ఉత్సవాన్ని తిలకించారు. సంతానం కోసం మహిళలు మడిస్నానాలు చేసి తపస్సుమాను ముందు మోకరిల్లి మొక్కుకున్నారు. ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు మేకళత్తూరు ఏలుమలై మొదలి అన్నదాన సేవాసంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శనివారం రథోత్సవం, ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. పాపానాయుడుపేట పురవీధుల్లో విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగలాపురం: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ, బీరకుప్పం, నాగలాపురం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ రమేష్ చంద్ర, అసిస్టెంట్ ఇంజినీర్ పృథ్వీ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం1 గంట వరకు విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ మరమ్మతు పనులు కారణంగా విద్యుత్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

సత్యవేడులో..

సత్యవేడు: దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ రవి తెలిపారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని 33 కేవీ ఫీడర్లు, తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, ఎల్లమండ్యం, గాజులమండ్యం, కుర్రకాలువ సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించడం, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ రమేష్ బాబు గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు.

కొల్లాపురమ్మ పాలాభిషేకం



పాల కలశాలను ఊరేగింపుగా తెస్తున్న మహిళలు

రేణిగుంట: టణంలోని పత్నికులంలో వెలసిన శ్రీశ్రీ కొల్లాపురి అమ్మవారి జాతరను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు శుక్రవారం ఉదయం అన్నైనగర్‌లోని శ్రీ నాగాలమ్మ ఆలయం నుంచి మహిళలు పాల కలశాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న శ్రీదేవి కరుమారి అమ్మకు ఆడినెల పౌర్ణమి నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పాలాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున మహిళలు పాల కలశాలతో శ్రీవేదనారాయణ స్వామివారి ఆలయం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పాలాభిషేకం చేసి, మొక్కులు సమర్పించారు.

సిరుల తల్లీ .. కాపాడరావమ్మా..



పూజలు చేసుకుంటున్న మహిళా భక్తులు



సత్యవేడు: అమ్మవారి ఆలయంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా వేసిన చలువ పందిళ్ల కింద మహిళలు పెద్దసంఖ్యలో నోములు నోచుకున్నారు. వేదికపై లక్ష్మీదేవి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించి, సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు చేసి లక్ష్మీపూజను సంప్రదాయపద్ధతిలో నిర్వహించారు. మహిళల చేత కుంకుమ పూజ చేయించారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి దంపతులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

08ఎస్‌కెహెచ్‌టి05 వాయినాలు అందజేస్తున్న ఈఓ దంపతులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

సత్యవేడు/బుచ్చినాయుడుకండ్రిగ: శ్రావణ మాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం సత్యవేడులోని అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు చేపట్టారు.

భూపతేశ్వర కోనలో యువకులకు జరిమానా

సత్యవేడు: నాగలాపురం మండలంలోని భూపతేశ్వర కోన, సద్ది కూడు మడుగులలో పర్యాటకులకు అనుమతి లేదని ఫారెస్టు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం చెన్నైకు చెందిన గోపినాద్(23), మాగిచ్‌నార్(25), విజయ్ కుమార్(20)తోపాటు మరో ఆరుగురు కలసి భూపతేశ్వరకోనకు వచ్చారు. అనుమతి లేదని చెప్పిన వస్తుండడంతో పర్యాటకులకు రూ.24 వేలు జరిమానాను ఫారెస్టు అధికారులు విధించారు. భూపతేశ్వర కోనలోకి ఈ నెల7వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ప్రవేశించారు. ఎఫ్‌బీఓలు వేణుగోపాల్, నాగేశ్వర రావు, ఎఫ్ఆర్ఓ త్రినాథ్‌రెడ్డి ఆ యువకులను అదుపులోకి తీసుకొని రూ.24 వేలు జరిమానా విధించారు.